

## అవైస్‌కు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాజస్థాన్ వేదికగా జరిగిన 34వ జాతీయ సీనియర్ వుషు టోర్నీలో తెలంగాణకు చెందిన మహమ్మద్ అవైస్ కాంస్య పతకంతో మెరిశాడు. శుక్రవారం జరిగిన సీనియర్ విభాగంలో బరిలోకి దిగిన నిజామాబాద్ ప్లేయర్ అవైస్ అద్భుత ప్రదర్శన కనబరుస్తూ మూడో స్థానంలో నిలిచాడు. గత కొన్నేండ్లుగా నిజామాబాద్‌లో కోచ్ అబ్దుల్ ఒమర్ దగ్గర శిక్షణ తీసుకుంటున్న అవైస్.. జాతీయ స్థాయి టోర్నీలో ఆకట్టుకున్నాడు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు అతన్ని అభినందించారు.

## రసవత్తరంగా గాలె టెస్టు

గాలె: శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య గాలె వేదికగా జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. తొలి ఇన్నింగ్స్‌లో లంకేయులు.. 485 పరుగులకు ఆలౌట్ కాగా పర్యాటక బంగ్లాకు 10 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా.. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. షద్మన్ ఇస్లాం (76) అర్ధ శతకంతో మెరవగా తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరోలు కెప్టెన్ నజ్ముల్ (56*), ముష్ఫీకర్ (22*) క్రీజులో ఉన్నారు.

## హైదరాబాద్ హీరోస్ హ్యాట్రిక్

• రగ్బీ ప్రీమియర్ లీగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్(ఆర్‌పీఎల్) తొలి సీజన్‌లో హైదరాబాద్ హీరోస్ హ్యాట్రిక్ విజయంతో అదరగొట్టింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 43-12 తేడాతో కళింగ బ్లాక్‌టైగర్స్‌పై ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా మూడో విజయాన్ని ఖాతాలో వేసుకున్న హీరోస్.. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతున్నది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఈ పోరులో హీరోస్ ఏడు ట్రైలను సాధించింది. జట్టులో ఆరుగురు ప్లేయర్లు ట్రైలు చేసి తమ సత్తాచాటారు. జోజి నాసోవా రెండు ట్రైలతో అద్భుత ప్రదర్శన కనబర్చగా, టెరియో తమాని నాలుగు ట్రైలను గోల్‌గా మలిచి జట్టుకు 8 పాయింట్లను అందించాడు. మ్యాచ్‌లో తొలుత కళింగ ఆధిపత్యం ప్రదర్శించినా.. ఆ తర్వాత పుంజుకున్న హైదరాబాద్ వరుస పాయింట్లతో జోరు కనబరిచింది. కీలకమైన ద్వితీయార్థంలో అదే దూకుడుతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.



## భారత్‌కు తొమ్మిది పతకాలు

సింగపూర్: ఆసియా ఆర్చరీ కప్ స్టేజ్-2లో భారత్‌కు తొమ్మిది పతకాలు దక్కాయి. వేర్వేరు టీమ్‌విభాగాల్లో ఐదు జట్లు ఫైనల్ పోరుకు అర్హత సాధించినా అన్నింట్లో భారత్ రెండో స్థానంలో నిలిచి రజత పతకాలతో సరిపెట్టుకుంది. టోర్నీలో మొత్తంగా భారత ఆర్చర్లు రెండు స్వర్ణాలు సహా, ఆరు రజతాలు, ఒక కాంస్యం ఖాతాలో వేసుకున్నారు. భారత ఆర్చర్లు తమ కంటే తక్కువ సీడ్ ప్లేయర్ల చేతిలో ఓటమిపాలై రజత పతకాలకు పరిమితమయ్యారు. పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో విష్ణుచౌదరి, పారాస్ హుడా, జుయెల్ సర్కార్‌తో కూడిన భారత త్రయం 0-6తో జపాన్ చేతిలో ఓడింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో చౌదరీ, వైష్ణవి పవార్ జోడీ 32-35తో ఇండోనేషియాపై ఓడి రజతంతో సంతృప్తిపడింది. మరోవైపు పురుషుల కాంపౌండ్ ఫైనల్లో కుశాల్‌దలాల్ 149-143తో జోషు వా మనాన్ (ఆస్ట్రేలియా) పై గెలిచి పసిడితో మెరిశాడు. మహిళల విభాగంలో తేజల్ సాల్వే 146-144తో భారత్‌కే చెందిన షణ్ముకినాగ సాయిపై గెలిచి స్వర్ణం సొంతం చేసుకుంది.

## సెంథిల్ కుమార్‌కు కాంస్యం



కౌలాలంపూర్: మలేషియా వేదికగా జరుగుతున్న ఏషియన్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత యువ ప్లేయర్ వెలావన్ సెంథిల్‌కుమార్ కాంస్య పతకంతో మెరిశాడు. శుక్రవారం జరిగిన పురుషుల వ్యక్తిగత సెమీఫైనల్ పోరులో 9-11, 11-13, 11-5, 6-11తో టాప్‌సీడ్ లు జు క్వాన్(హాంకాంగ్) చేతిలో ఓటమిపాలయ్యాడు. 65 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో సెంథిల్ ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వడంలో విఫలమయ్యాడు.

## మహిళల క్రికెట్‌లో అనుమతివ్వండి..

• ఐసీసీ, బీసీసీఐకి అనయ బంగర్ లేఖ

లండన్: మహిళల క్రికెట్‌లో ఆడేందుకు తనకు అనుమతి ఇవ్వాలని అనయ బంగర్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు హార్మోన్ రిప్లేస్‌మెంట్ థెరపీ(హెచ్‌ఆర్‌టీ) నివేదికను పొందుపరుస్తూ ఎనిమిది పేజీలతో కూడిన లేఖను ఐసీసీతో పాటు బీసీసీఐకి పంపింది. ట్రాన్స్‌జెండర్లకు మద్దతుగా నిలువాల్సిందిగా అనయ సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన తన లేఖలో ప్రముఖంగా ప్రస్తావించింది. 2021లో అబ్బాయి నుంచి అమ్మాయిగా మారిన 24 ఏండ్ల అనయ మాట్లాడుతూ 'జాతీయ జట్టుకు తిరిగి ఆడాలనుకుంటున్నాను. దేశానికి ఆడాలన్న తపన నాలో అప్పుడు ఎలా ఏందో ఇప్పటికీ అలాగే ఉంది. కలను సాకారం చేసుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఏదో ఒక రోజు తండ్రి సంజయ్ బంగర్ నాకు మద్దతుగా నిలుస్తాడన్న నమ్మకం నాకుంది' అని లేఖలో పేర్కొంది. 2023 వన్డే ప్రపంచకప్ సమయంలో క్రికెట్‌లో ట్రాన్స్‌జెండర్ల ప్రాతినిధ్యంపై ఐసీసీ నిషేధం విధించిన విషయం విదితమే.



# శతక ధమాకా

సెంచరీలతో రెచ్చిపోయిన గిల్, జైస్వాల్

రాణించిన పంత్, రాహుల్

భారీ స్కోరు దిశగా భారత్

మొదటి రోజు 359/3

ఎన్నో అనుమానాలు! అంతకుమించిన సందేహాలు! కోహ్లీ, రోహిత్, అశ్విన్ వంటి దిగ్గజాల నిష్క్రమణ వేళ కఠినమైన ఇంగ్లండ్ పిచ్‌లపై అంతగా అనుభవం లేని టీమ్‌ఇండియా ఎలా ఆడబోతుందోనని..! కానీ తొలిటెస్టు మొదటిరోజే ఆ అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ లీడ్స్ టెస్టులో యువ భారత్ అదరగొట్టింది. సారథ్య బాధ్యతలు అందుకున్న అరంగేట్ర టెస్టులోనే బ్యాటుతో శుభ్‌మన్ గిల్ అజేయ శతకంతో సత్తాచాటగా.. క్రీజులో కుదురుకుంటే మూడంకెల స్కోరు సాధించిగానీ పోరాటాన్ని ఆపని యోధుడు యశస్వీ జైస్వాల్ సెంచరీకి తోడు వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ అర్ధ శతకంతో భారత్ భారీ స్కోరు దిశగా సాగుతున్నది.


గిల్ (127*)

జైస్వాల్ (101)

**5** టెస్టులలో సారథిగా తొలి మ్యాచ్‌లోనే సెంచరీ చేసినవారిలో గవాస్కర్, హజారే, వెంగ్‌సర్కార్, కోహ్లీ తర్వాత గిల్ ఐదో స్థానంలో నిలిచాడు.

హెడింగ్లీ: భారత టెస్టు జట్టు కొత్త సారథి శుభ్‌మన్ గిల్ (175 బంతుల్లో 127 నాటౌట్, 16 ఫోర్లు, 1 సిక్స్), యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (159 బంతుల్లో 101, 16 ఫోర్లు, 1 సిక్స్) శతక్కొట్టడంతో హెడింగ్లీలో ఇంగ్లండ్‌తో మొదలైన తొలి టెస్టులో భారత్ మొదటి రోజే భారీ స్కోరు చేసింది. లీడ్స్ వేదికగా శుక్రవారం మొదలైన టెస్టులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేస్తున్న భారత్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 359 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. గిల్, జైస్వాల్ శతకాలకు తోడు రిషభ్ పంత్ (102 బంతుల్లో 65, 6 ఫోర్లు, 2 సిక్సర్లు), కేఎల్ రాహుల్ (78 బంతుల్లో 42, 8 ఫోర్లు) రాణించడంతో తొలి రోజు మూడు సెషన్లలో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. రెండో రోజూ ఇదే ఆటను కొనసాగిస్తే మ్యాచ్‌పై గిల్ సేనకు పట్టుచిక్కినట్టే! ఇక బౌలింగ్‌లో అనుభవలేమితో ఇంగ్లండ్ పేసర్లు తొలిరోజు పూర్తిగా తేలిపోయారు. స్టోక్స్ (2/43) మినహా మిగిలిన పేసర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు.

### ఆరంభమే అదుర్స్

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు తాము ఎంత తప్పు చేశామో తెలియడానికి పెద్దగా సమయం పట్టలేదు. అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ లేని లోటు ఆ జట్టులో.. స్పష్టంగా కనబడింది. సీనియర్ పేసర్ క్రిస్ వోక్స్‌తో పాటు బ్రైడన్ కార్స్, జోష్ టంగ్ తేలిపోవడంతో భారత ఓపెనర్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసి అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. బౌండరీతో పరుగుల వేటను ఆరంభించిన జైస్వాల్, రాహుల్ ఇంగ్లిష్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. పూర్తిగా ఆఫ్‌సైడ్ ఆటతో అలరించిన ఈ ద్వయం 16 బౌండరీలు కొడితే.. అందులో అన్నీ ఆఫ్‌సైడ్‌లో ఆడినవే కావడం విశేషం. స్టోక్స్ బౌలింగ్‌లో రాహుల్.. బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో అలరించాడు. కానీ సాఫీగా సాగుతున్న భారత ఇన్నింగ్స్‌లో లంచ్‌కు ముందు డబుల్ షాక్ తాకింది. కార్స్ వేసిన 25వ ఓవర్లో రాహుల్.. ఆఫ్ స్టంప్‌కు ఆవలగా వెళ్తున్న బంతిని వెంటాడి ఫస్ట్ స్లిప్స్‌లో జో రూట్ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి ఓవర్‌లో స్టోక్స్ వేసిన పక్కా ప్రణాళికతో సాయి సుదర్శన్ అరంగేట్ర టెస్టు అతడికి నిరాశను మిగిల్చింది.

### జైస్వాల్, గిల్ జోరు

92/2తో భోజన విరామానికి వెళ్లొచ్చిన భారత్.. ఆ తర్వాత జోరు పెంచింది. కెప్టెన్ గిల్ ఆరంభంలో వన్డే తరహా ఆట ఆడాడు. వోక్స్ బౌలింగ్‌లో మూడు బౌండరీలు రాబట్టాడు. 96 బంతుల్లో జైస్వాల్ ఫిఫ్టీ పూర్తయింది. గిల్ అండతో జైస్వాల్ కూడా దూకుడు పెంచాడు. వోక్స్ 38వ ఓవర్లో 3 ఫోర్లు బాదిన అతడు.. టంగ్ ఓవర్లో డీప్ పాయింట్ మీదుగా సిక్సర్ బాదాడు. గిల్ కూడా టంగ్ ఓవర్లో బౌండరీతో 55 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేశాడు. టెస్టులలో అతడికి ఇదే ఫాస్టెస్ట్ (బంతులపరంగా) హాఫ్ సెంచరీ. కార్స్ 48వ ఓవర్లో తొలి బంతిని బౌండరీగా మలిచి 90లలోకి వచ్చిన జైస్వాల్.. అదే ఓవర్లో 4, 5 బంతులనూ ఫోర్లు కొట్టాడు. ఆరో బంతికి సింగిల్ తీసి తన కెరీర్‌లో ఐదో శతకం నమోదుచేశాడు. అయితే టీ విరామానికి వెళ్లొచ్చాక స్టోక్స్ వేసిన రెండో ఓవర్లో జైస్వాల్ బౌల్డ్ అవడంతో 129 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

### రాకుమారుడి తొలి ముద్ర

జైస్వాల్ నిష్క్రమించే సమయానికి ఆటపై పూర్తి పట్టు సాధించిన గిల్.. పంత్‌తో కలిసి స్కోరుబోర్డును నడిపించాడు. ఇన్నింగ్స్‌కు ఇరుసైన నాలుగో స్థానంలో పరిస్థితులకు తగ్గట్టుగా ఆడుతూ శతకం దిశగా సాగాడు. ఫిఫ్టీ తర్వాత కాస్త నెమ్మదించిన గిల్.. పంత్‌తో స్ట్రైక్ రొటేట్ చేసి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించాడు. బషీర్ బౌలింగ్‌లో పంత్ ఫోర్, సిక్సర్‌తో భారత్ 300 పరుగుల మార్కును అందుకుంది. 98 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద టంగ్ బౌలింగ్‌లో ఆఫ్‌సైడ్ బౌండరీ బాదిన గిల్.. సారథిగా తొలి టెస్టులోనే బ్యాట్‌తో తన ముద్రను ఘనంగా వేశాడు. టెస్టుల్లో అతడికి ఇది ఆరో శతకం. పంత్ తన సహజశైలికి భిన్నంగా సంయమనంతో ఆడటం గమనార్హం. అజేయమైన నాలుగో వికెట్‌కు గిల్-పంత్ ద్వయం ఇప్పటికే 130 పరుగులు జోడించింది.

**5** ఇంగ్లండ్‌లో తొలి టెస్టు ఆడుతూ శతకం చేసిన ఐదో భారత బ్యాటర్ జైస్వాల్. అతడికంటే ముందు సందీప్ పాటిల్, గంగూలీ, విజయ్ మంజ్రేకర్, మురళీ విజయ్ ఉన్నారు.

**1** ఇంగ్లండ్‌తో వారిగడ్డపై టెస్టులు ఆడుతూ మొదటి రోజు ఆటలో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. 2022లో ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో 338/7 చేసింది. మొత్తంగా శ్రీలంక (2017లో శ్రీలంకపై 399/3), సౌతాఫ్రికా (2001లో 372/1) తర్వాత విదేశీ గడ్డపై థర్డ్ హయ్యెస్ట్ స్కోరు.

### సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 85 ఓవర్లలో 359/3 (గిల్ 127*, జైస్వాల్ 101, స్టోక్స్ 2/43, కార్స్ 1/70)

### అయ్యో సాయి



జూన్ 20.. భారత క్రికెట్ దిగ్గజాలుగా వెలుగొందుతున్న సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రావిడ్, విరాట్ కోహ్లీకి ఈ తేదీ ఎంతో ప్రత్యేకం. దాదా, ద్రావిడ్ 1996లో ఇదే రోజు ఇంగ్లండ్‌పై అరంగేట్రం చేయగా కోహ్లీ సైతం 2011 జూన్ 20న వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో టెస్టులకు ఎంట్రీ ఇచ్చాడు. దిగ్గజాలు టెస్టు అరంగేట్రం చేసిన రోజే సాయి సుదర్శన్ కూడా టెస్టులలో తొలి అవకాశం అందుకున్నా అదృష్టం మాత్రం అతడిని వెక్కిరించింది. మొదటి టెస్టులో గంగూలీ సెంచరీ చేయగా ద్రావిడ్ 95 రన్స్ చేశాడు. కోహ్లీ 19 పరుగులు చేయగా.. సాయి డకౌట్ అయ్యాడు.

# అందని సిగ్నల్స్‌తో అవస్థలు!

- ఏజెన్సీ గ్రామాలకు అందని బీఎస్ఎన్ఎల్ సేవలు
- అవస్థలు పడుతున్న పలువురు వినియోగదారులు
- చేసేది లేక ప్రైవేటు వైపు మొగ్గు చూపుతున్న వైనం

పర్ణశాల, జూన్ 20 : బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలు సరిగ్గా అందకపోవడంతో మారుమూల గిరిజన గ్రామాల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎవరికైనా ఫోన్ చేయాల్సి వస్తే సిగ్నల్స్ అందకపోవడంతో ఎత్తయిన ప్రదేశాలు, వాటర్ ట్యాంకులు, చెట్లు ఎక్కాల్సి వస్తోందని వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పరిధిలో బీఎస్ఎన్ఎల్ ఉండడం.. తక్కువ ధరకే సేవలు అందిస్తుండడంతో ఏజెన్సీ ప్రజలందరూ అటువైపే మొగ్గు చూపారు. అయితే టవర్లు నిర్మించిన కొద్దిరోజులకే సిగ్నల్స్ సరిగా అందకపోవడం.. సేవల్లో తరచూ అంతరాయం ఏర్పడడంతో విసుగెత్తిన వినియోగదారులు ప్రైవేటు నెట్‌వర్క్ సేవల వైపు దృష్టి సారించారు. దీంతో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు ఉన్నా.. వినియోగదారుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోవడంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు చింతగుప్ప గ్రామంలో ఏడాది క్రితం బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మించారు. గత జనవరి నుంచి 4జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కానీ.. ప్రారంభమైన నెల రోజుల తర్వాత నుంచి బీఎస్ఎన్ఎల్ సేవల్లో తలెత్తిన సాంకేతిక సమస్యలతో ఫోన్లు మూగబోయాయి. టవర్ పరిధిలో సుమారు మూడు, నాలుగు గ్రామాలకు బీఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులోకి రావడంతో చాలా మంది ఆ సిమ్‌లను వాడడం ప్రారంభించారు. ఇప్పుడు సిగ్నల్స్ లేకపోవడంతో భారమైనా ప్రైవేటు నెట్‌వర్క్ వైపు మొగ్గు చూపాల్సి వస్తున్నదని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని కోరుతున్నారు.


చింతగుప్ప గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్

### సిగ్నల్స్ లేక ఇబ్బంది పడుతున్నాం..



మా గ్రామంలో రెండు నెలలుగా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ రావడం లేదు. చేసేది లేక ధర ఎక్కువైనా అవసరాల కోసం ప్రైవేటు సిమ్‌లు వాడాల్సి వస్తోంది. మా గ్రామంలో సెల్ టవర్ ఉన్నా నిరుపయోగంగా మారింది. బీఎస్ఎన్ఎల్ అధికారులు ఇప్పటికైనా సెల్ సిగ్నల్ అందేలా చర్యలు చేపట్టాలి.

**-ఇరకం శ్రీను, గ్రామస్తుడు, చింతగుప్ప**

### 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం..

దుమ్ముగూడెం మండల పరిధిలో సుమారు 9 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో గ్రామాల్లో కూడా టవర్లు నిర్మించాం. ప్రస్తుతానికి ఆ టవర్ల ద్వారా 4జీ నెట్వర్క్ సేవలు అందిస్తున్నాం. సాంకేతిక సమస్యతో పూర్తిస్థాయిలో సిగ్నల్స్ అందడం లేదు. మరో 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

**-మదన్‌గోపాల్, బీఎస్ఎన్ఎల్ ఏఈ**

### నెల రోజులే సిగ్నల్స్ వచ్చాయి..



సిమ్ తీసుకున్న నెల రోజులు మాత్రమే బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ అందాయి. ఎవరికైనా ఫోన్ చేయాలనుకుంటే వాటర్ ట్యాంకు ఎక్కి మాట్లాడాల్సి వస్తుంది. మా గ్రామంలో వంద మందికి పైనే బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉన్నా.. సిగ్నల్స్ లేకపోవడంతో ప్రైవేటు నెట్‌వర్క్‌లోనే మారారు.

**-తుర్రం రాము, గ్రామస్తుడు, కొత్తజిన్నులగూడెం**

# వానకాలం మెట్ట సాగుకు దిగులొద్దు..

**విత్తన విభాగం హెడ్ డాక్టర్ నగేశ్**

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 20 : రాష్ట్రంలో వానకాలం సాగకు వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షం పడలేదని, రెండు ఆపైగా వర్షాలు కురిసిన చోట మెట్ట సాగు చేసుకోవచ్చని, దిగులు చెందాల్సిన అవసరం లేదని, వచ్చే నెల మొదటి వారం వరకు సాగు చేసుకోవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన విత్తన విభాగం హెడ్ సీనియర్ శాస్త్రవేత్త జి.నగేశ్ తెలిపారు. రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పడకపోవడం వల్ల రైతులు దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే నెల మొదటి వారం వరకు మెట్ట సాగు చేసుకోవచ్చని ఆయన సూచించారు. విత్తన ఎంపిక, పొలం చదును చేయడం, నేలను వీలైనంతవరకు లోతుగా దున్నడం వంటి పనులు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. మెట్ట పంటలో ప్రధానంగా, పత్తికి బదులుగా మొక్కజొన్న, జొన్న, ఆముదం, వేరుశనగ, కంది తదితర పంటలు సాగు చేసి అధిక దిగుబడులు, మంచి లాభాలు ఆర్జించవచ్చని ఆయన సూచించారు. మేలైన రకాలను ఎంపిక చేసుకొని వ్యవసాయ శాస్త్రవేత్తలను, అధికారులను సంప్రదించి సాగు చేయాలన్నారు. వీలైనంతవరకు గుర్తింపు గల విత్తనాలు, సేంద్రియ ఎరువులను వాడాలని ఆయన సూచించారు. తప్పని పరిస్థితుల్లో మాత్రమే రసాయన ఎరువులు వాడాలని తెలిపారు. సేంద్రియ సాగుకు అధిక డిమాండ్ ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన నాణ్యత గల విత్తనాలను, ప్రధానంగా మొక్కజొన్నలో డీహెచ్ఎం 117, డీహెచ్ఎం 121, కరీంనగర్ మక్కా-1, కరీంనగర్ మక్కతోపాటు గుర్తించబడిన వాటిని ఎంపిక చేసుకోవాలని ఆయన సూచించారు. కందిలో డబ్ల్యూఆర్‌జీఈ-97(వరంగల్ కంది 1), డబ్ల్యూఆర్‌జీఈ-93(తెలంగాణ కంది ), డబ్ల్యూఆర్‌జీఈ-121(తెలంగాణ కంది-2), టీడీఆర్‌జీ-4(హనుమ) డబ్ల్యూఆర్‌జీ-65( రుద్రేశ్వర), పీఆర్‌జీ-176, ఉజ్వల ఐసీపీహెచ్-2740(మన్నెంకొండ కంది), టీడీఆర్జీ-272(తెలంగాణ కంది-4), డబ్ల్యూఆర్‌జీఈ-255, టీడీఆర్జీ-59 వంటి రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. మన నేలల్లో 19-19-19 ఫెర్టిలైజర్ వాడకం మంచి ఫలితాలు ఇస్తుందని ఆయన వివరించారు.

# యోగా.. మంచిదేగా..!

- మెళకువలు నేర్చుకునేందుకు మక్కువ చూపుతున్న మహిళలు
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం


యోగా శిక్షకుడి ఆసనాలు


యోగాను అభ్యసిస్తున్న టెంపుల్ సిటీ మహిళలు

ఖమ్మం రూరల్, జూన్ 20 : నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడే గృహిణులు, వయసు పైబడినవారు మంచి ఆరోగ్యం కోసం యోగా సాధనలో నిమగ్నమవుతున్నారు. పొద్దంతా తమ పనులను తామే చురుకుగా చేసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి పెద్దతండా సమీపంలోని టెంపుల్ సిటీలో యోగా శిక్షకుడు నాగార్జున నిత్యం 20 మంది మహిళలకు యోగా సాధనలో శిక్షణ ఇస్తున్నాడు. వివిధ యోగాసనాల్లో మెళకువలు నేర్పిస్తూ తర్ఫీదు ఇస్తున్నాడు. అతడి వద్ద శిక్షణ పొందిన మహిళలు తమ ఆరోగ్యంలో వస్తున్న మార్పులను గమనిస్తూ సాధనపై మరింతగా దృష్టి సారిస్తున్నారు. తనకు వచ్చిన విద్యను పది మందికి పంచి సంపూర్ణ ఆరోగ్య సమాజ నిర్మాణంలో నేను సైతం అనే ఉద్దేశంతో మహిళలకు యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు శిక్షకుడు నాగార్జున చెబుతున్నారు.

### యోగాసనాలు ఎంతో ప్రయోజనకరం..



కొద్ది నెలలుగా విపరీతమైన భుజం నొప్పితో బాధపడేదాన్ని. మిత్రుల సలహా మేరకు టెంపుల్ సిటీలో ఏర్పాటు చేసిన నందీశ్వర యోగా కేంద్రంలో కొద్ది రోజుల నుంచి శిక్షణ తీసుకుంటున్నా. ప్రస్తుతానికి శరీరం పటుతత్వంతోపాటు భుజం నొప్పి తగ్గిపోయింది. యోగాసనాలు నేర్చుకోవడం ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

**-శిరీష, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్, టెంపుల్ సిటీ**

### యోగాతోనే ఆరోగ్యం..



ప్రతీ ఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలి. యోగా అలవాటు చేసుకుంటే మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందవచ్చు. టెంపుల్ సిటీలోని ప్రతీ ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఉద్దేశంతో యోగా కేంద్రం ఏర్పాటు చేశాను. ప్రతీ ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో శిక్షణ అందిస్తున్నా.

**-నాగార్జున, యోగా శిక్షకుడు, టెంపుల్ సిటీ**

# వివాదంలో చీమలపాడు ఇసుక ర్యాంపు

### సభ్యుల్లో అసంతృప్తి.. పరస్పర ఆరోపణలు


చీమలపాడు ఇసుక ర్యాంపు స్టాక్‌పాయింట్

చర్ల, జూన్ 16 : మండల పరిధిలోని చీమలపాడు ఇసుక ర్యాంపు వివాదాలకు దారి తీసింది. ఇటీవల చర్ల మండలంలో మంజూరైన కుదునూరు, ఆర్ కొత్తగూడెం, గొమ్ముగూడెం, తేగడ, సుబ్బంపేట, గొల్లగూడెం, చీమలపాడుతోపాటు గతంలో మంజూరైన సి కత్తిగూడెం, వీరాపురం ఇసుక ర్యాంపుల్లో ఇసుక తోడకం పలు దశల్లో ఉంది. కొత్తగా కొయ్యూరు గ్రామ పంచాయతీ చీమలపాడు శిర్రాజుల మహిళా సొసైటీకి మంజూరైన చీమలపాడు ర్యాంపులో 5 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీసేందుకు మైనింగ్‌శాఖ అనుమతి ఇచ్చింది. కొద్దిరోజులుగా ఇసుక ర్యాంపు నిర్వహణ పనులు మొదలయ్యాయి. ఈ శిర్రాజుల మహిళా సొసైటీలో మొత్తం 318 మంది సభ్యులున్నారు. వీరిలో సుమారు 30మంది చీలిపోయి సొసైటీపై తిరుగుబాటు చేసి పలు ఆరోపణలు చేస్తున్నారు. సభ్యులైన తమకు వివరాలు చెప్పడం లేదని వాపోతున్నారు.

### చెప్పుడు మాటలు వినొద్దు..



కలిసి కష్టపడి ర్యాంపు మంజూరు చేయించుకున్నాం. కలిసి పని చేసుకుందాం. సమస్యలుంటే చర్చించుకుందాం. చీమలపాడు శిర్రాజుల మహిళా సొసైటీలో మొత్తం 318 సభ్యులం ఉన్నాం. సుమారు 30మంది చెప్పుడు మాటలు విని మాపైన ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పుడే స్టాక్ పాయింట్‌కు ఇసుకను తరలించే పనులు మొదలుపెట్టాం. వచ్చి చూడండి.. తొందరొద్దు. కావాలని మనల్ని విడదీయటానికి కొందరు కుట్రలు పన్నుతున్నారు.

**- తెల్లం కౌసల్య, సొసైటీ అధ్యక్షురాలు**

# అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**అదనపు కలెక్టర్ శ్రీజ**


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, జూన్ 20 : ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలో నాణ్యమైన విద్య అందించేందుకు అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. శుక్రవారం జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డీపీఆర్‌సీ భవనంలో బీఏఎస్ పథకానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు సీట్లు కేటాయించేందుకు లాటరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీజ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రైవేటు పాఠశాలలో ఎస్సీ విద్యార్థులకు ఈ పథకం ద్వారా 1వ తరగతి, 5వ తరగతులలో ప్రవేశాలు కల్పించి వారికి 10వ తరగతి వరకు ఉచితంగా విద్యను అందిస్తుందన్నారు. ఎస్సీ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ 1వ తరగతిలో ప్రవేశాలకు 319 మంది విద్యార్థులు దరఖాస్తులు చేయగా 128 మందిని ఎంపిక చేశామన్నారు. 5వ తరగతిలో ప్రవేశాలకు 346 మంది దరఖాస్తులు చేసుకుంటే 131 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేశామని వివరించారు. కార్యక్రమంలో డీఈవో సత్యనారాయణ, డీఎల్‌పీవో రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.